ప్రజాశక్తి

బుధవారం 12 నవంబరు, 2025

5

శ్రీకాకుళం



రేపట్నుంచి 'పది' పరీక్షల ఫీజు చెల్లింపు


టెక్కలి : పదో తరగతి పరీక్షల ఫీజులు చెల్లింపునకు షెడ్యూల్ జారీ అయింది. ఈ నెల 13 నుంచి 25 వరకు పరీక్ష ఫీజులు చెల్లించాలి. తర్వాత రూ.50 అపరాధ రుసుంతో వచ్చే 3 వరకు గడువు పెంచారు. రూ.200 అపరాధ రుసుంతో వచ్చే నెల 15 వరకు ఫీజులు చెల్లించుకోవచ్చు. ఒక విద్యార్థి రూ.125 చొప్పున ఫీజు చెల్లించాలి. గతంలో పదో తరగతి తప్పిన విద్యార్థులు కూడా పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చు. వాస్తవంగా పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపులు ఈ పాటికే పూర్తి కావాల్సి ఉంది. ఈ సారి కొద్ది ఆలస్యమైంది. పరీక్షల ఫీజు చెల్లింపు విషయమై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సమాచారం అందించారు. జిల్లాలో 450 ఉన్నత పాఠశాలల్లో 21,381 మంది విద్యార్థులు సిద్ధంగా ఉండగా, 196 ప్రయివేట్ పాఠశాలల నుంచి 7,589 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు.

- కనువిందు చేసిన ప్రదర్శన
- పులకించిన పుస్తక ప్రియుల మనసు
- సాహిత్య సభలు, కవి సమ్మేళనాల హోరు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- చరిత్రలో నిలిచిపోతుంది
- ఎమ్మెల్యే గొండు శంకర్

వైభవోపేతం

పుస్తక మహోత్సవం

సిక్కోలు పుస్తక మహోత్సవం వైభవోపేతంగా మొదలైంది. శ్రీకాకుళం నగరంలోని ఏడు రోడ్ల కూడలి సమీపంలో ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మంగళవారం నిర్వహించిన వేడుకలను ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు ప్రచురణ సంస్థలు ఏర్పాటు చేసిన వేలాది పుస్తకాలను చూసి పుస్తక ప్రియుల మనస్సు పులకించింది. సాహిత్య సభలు, కవి సమ్మేళనాలు సాహిత్య ప్రియులను ఓలలాడించాయి. చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాలు అందరినీ ఆలోచింప చేశాయి. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టెలీ స్కోప్‌లో నుంచి నక్షత్రాలను చూసేందుకు చిన్నారులు పోటీ పడ్డారు.



పుస్తకాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ డి.వి.జి శంకరరావు, తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, అరసవల్లి

సిక్కోలు పుస్తక మహోత్సవం శ్రీకాకుళం జిల్లాకే గర్వకారణమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని స్థానిక ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో మంగళవారం పుస్తక మహోత్సవాని ప్రారంభించి మాట్లాడారు. పుస్తక మహోత్సవం సిక్కోలు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. పుస్తక ప్రదర్శన ఏర్పాటుతో కొత్త సంస్కృతికి నాంది పలికనట్లయిందన్నారు. ఏటా నిర్వహిస్తే భావి తరానినికి ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. జిల్లాలో తొలిసారి భారీ స్థాయిలో పుస్తక మహోత్సవం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పుస్తక ప్రియులకు ఇది బాగా ఉపయోగంగా ఉంటుందన్నారు. పుస్తక పఠనం ఎంతో విజ్ఞానదాయకమని అన్నారు. పార్వతీపురం మాజీ ఎంపీ డాక్టర్ డి వి.జి శంకరరావు మాట్లాడుతూ చరిత్రకు, వాస్తవాలకు పుస్తకమే ప్రామాణికమని అన్నారు. యువత, పిల్లల్లో పుస్తక పఠనాన్ని ప్రోత్సాహించాల్సిన అవసరముందని అన్నారు. పుస్తక మహోత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ కనుగుల సుధీర్ మాట్లాడుతూ టివిలు,సోషల్ మీడియా ప్రభావంతో పుస్తక పఠనం క్రమేణా తగ్గిపోతోందని అన్నారు. అసత్య వార్తలతో ఏది నిజమో తెలుసుకోలేని పరిస్థితుల్లో పుస్తకాలే ఆధారంగా ఉన్నాయన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ ప్రజల్లో మూఢ నమ్మకాలను పొగొట్టి శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు జెవివి కృషి చేస్తోందని చెప్పారు. ప్రముఖ రచయిత అందెశ్రీ మృతికి సంతాపంగా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో సిక్కోలు పుస్తక మహోత్సవ కమిటీ కన్వీనర్ కె.శ్రీనివాసు, సాహిత్య కమిటీ, సాంస్కృతిక కమిటీ కన్వీనర్లు కంచరాన భుజంగరావు, పి.సుధాకర్, జెవివి రాష్ట్ర కోశాధికారి జి.మురళీధర్, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు కొత్తకోట అప్పారావు, నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, పి.కూర్మారావు, ఎం.వాగ్దేవి, వి.ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



అనంతరం నృత్యదర్శకురాలు నీరజా సుబ్రహ్మణ్యం శిష్య బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేశారు. మెళియాపుట్టి మండలం చీపురుపల్లికి చెందిన కళాకారులు ప్రదర్శించిన తప్పెట గుళ్ల సందర్శలకు అలరించాయి.

పుస్తక ప్రదర్శనను తిలకించిన అతిథులు



అంతకు ముందు అతిథులతో కలిసి ఎమ్మెల్యే గొండు శంకర్ పుస్తక ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా పలు పుస్తకాలను కొనుగోలు చేశారు. ప్రాంగణంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన పలు సైన్స్ ప్రయోగాలను చూశారు.

సాహిత్య సభలు, కవి సమ్మేళనాలు

అనంతరం గంటేడ గౌర నాయుడు రచించిన 'నదికి ఓ భాష ఉంది' పుస్తకాన్ని ప్రముఖ రచయిత నల్లి ధర్మారావు ఆవిష్కరించారు. సిరికి స్వామి నాయుడు రచించిన 'శతర' అనే పుస్తకాన్ని పార్వతీపు రానికి చెందిన రచయిత మానాపురం రాజా చంద్రశేఖర్ ఆవిష్కరించి సమీక్షించారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు.

పుస్తకాలు చదవాలి



పుస్తకం మహోత్సవ కార్యక్రమాలు ఎంతో చక్కగా ప్రారంభమైంది. పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవడం అందరికీ అవసరం. పుస్తకాలు చదవడం వల్ల మానసిక శాంతి లభిస్తుందస్తుంఇ.

- శ్రీలత, సిక్కోలు పుస్తక ట్రస్టు అధ్యక్షులు

విలువలు నేర్పుతుంది



పుస్తక మహోత్సవ కార్యక్రమం ఎంత విలువైంది. శ్రీకాకుళంలో తొలిసారిగా ఎంతోమంది పుస్తకప్రియులకు పుస్తక ప్రదర్శన ఎన్నో విలువలు నేర్పుతుంది. పిల్లలకు పుస్తకాలు చదవడం నేర్పించాలి.

- జె.వి.నరసింహం, ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగి

ఆకట్టుకుంది



పుస్తక మహోత్సవ కార్యక్రమంలో సైన్స్ ప్రయోగాలు, మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం నెలకొల్పుతుంది. సైన్స్‌పై విద్యార్థులకు ఆసక్తి కనబరిచేటట్లు ప్రదర్శనలు చేశారు. సైన్స్ వైజ్ఞానిక సంబంధించి మైక్రోస్కప్‌తో ఆకాశంలో ఉన్న చుక్కలను చూడడం, ఇనుప కంచిపైన కూర్చోవడం, గాజు పెంకులపై నడవడం, సైన్స్ ప్రయోగాలు ఎంతగానో అలరించాయి.

- డి.సౌమ్య, డిగ్రీ విద్యార్థిని



సైన్స్ ప్రయోగాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

చిన్నారులను ఆకర్షించిన టెలీ స్కోప్

ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన టెలీ స్కోప్ చిన్నారులను అమితంగా ఆకర్షించింది. జెవివి యూత్ విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.మహేష్ టెలీ స్కోప్ ద్వారా సందర్శలకు అంతరిక్ష వీక్షణం చూపించారు. వైజ్ఞానిక కార్యక్రమాల్లో భాగంగా గాజు పెంకులపై నడవడం, మేకుల కుర్చీపై కూర్చోవడం వంటి అంశాలపై సైన్స్ దృగ్వియాలను విద్యార్థులకు వివరించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.ప్రదీప్ పలు వైజ్ఞానిక విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు బొత్స వెంకటరావు పలు వైజ్ఞానిక ప్రదర్శలను నిర్వహించారు.



టెలీ స్కోప్‌లో చూస్తున్న విద్యార్థినులు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గృహ నిర్మాణ బకాయిల చెల్లింపుపై దృష్టి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల బిల్లుల బకాయిల సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్ మంగళవారం మండలస్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. 2014-19 మధ్య ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సంబంధించిన రూ.కోట్ల మేర బిల్లులు జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉండటంపై అధికారులను నిశితంగా ప్రశ్నించారు. తాజాగా నిర్మాణంలో ఉన్న ఆయా కాలనీల పరిస్థితి గురించి వివరాలు అడిగారు. అలాగే ప్రజలకు సత్వర సేవలు అందించే కీలక అంశాలలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, వరి ధాన్యం సేకరణకు సంబంధించి వాహనాల నమోదు, రైతు సేవా కేంద్రాల తనిఖీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, ప్రజారోగ్యంపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలాల్లో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో మందుల పంపిణీ, పరిశుభ్రత, డయాగ్నోస్టిక్ సేవలు పటిష్ఠంగా ఉండాలని సూచించారు. వసతిగృహాల్లో నమోదవుతున్న జ్వరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రాబీస్ వాక్సిన్, పాము కాటుకు యాంటీ వీనం సరిపడా నిల్వలు ఉండేలా చూడాలని వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. వసతిగృహాల పరిసరాల్లో కుక్కలు, కోతులు, పాములు, ఎలుకల బెడద లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని పంచాయతీ సెక్రటరీలకు, జిల్లా అటవీ శాఖ అధికారికు ఆదేశించారు. సామాజిక పారిశుధ్యంపై సమీక్షిస్తూ, కమ్యూనిటీ శానిటరీ డెవలప్‌మెంట్ టెక్నాలజీ, జి.సిగడాం, కవిటి, పొందూరులో సాంకేతిక సమస్యల కారణంగా పలు అంశాలు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. ఇతర కీలక అంశాలైన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, కోర్టు కేసుల పెండెన్సీపై సమీక్షించారు. ఉపాధి హామీ బిల్లుల అప్‌లోడింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. రెవెన్యూ అంశాలలో భాగంగా అన్నదాత సుఖీభవ, ఇళ్ల స్థలాల పెండెన్సీ, రెగ్యులరైజేషన్, ఇ-పంట నమోదు క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ ఇన్‌ఛార్జి అధికారి లక్ష్మణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

చట్ట సవరణ అన్యాయం

శ్రీకాకుళం సిటీ: పెత్తందారులకు అనుకూలంగా మంత్రివర్గ సమావేశం 9/77 అసైన్డ్ చట్టాన్ని సవరించిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం విమర్శించారు. దళితులు, బలహీన వర్గాలకు చెందిన అసైన్డ్ భూములను అక్రమంగా, దౌర్జన్యంగా ఆక్రమించు కున్న పెత్తందారులకు దొడ్డిదారిన 99 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి ఈ సవరణ మంత్రివర్గం చేపట్టిందని ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో ఆక్రములకు గురైన రూ.13 లక్షల అసైన్డ్ భూములను 99 ఏళ్ల పాటు పెద్దలకు కట్టబెట్టేందుకు మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు మకాలు కొనుగోలు చేయొద్దని, టెస్టు కూడా చేయకూడదని, టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఫ్రీ ఓల్డ్‌పై నిషేధించిందని తెలిపారు, ఆ నిషేధాన్ని ఎత్తివేస్తూ ఆక్రమణదారులకు భూములు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం పూనుకోవడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనివల్ల లక్షలాది దళితులు, బలహీన తరగతుల కుటుంబాలు భూములు కోల్పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస్


యువత పారిశ్రామికవేత్తలు కావాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎచ్చెర్ల నియోజకవర్గం పారిశ్రామికవాడ పైడిభీమవరంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యాన రూ.14.60 కోట్ల వ్యయంతో 1.99 ఎకరాల్లో నిర్మించిన ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ భవనాన్ని 30వ సిఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా వర్చువల్ విధానంలో మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లాలో ప్రారంభించారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రతిఒక్కరూ యువ పారిశ్రామికవేత్తలు వినూత్నంగా ఆలోచించి, ఆవిష్కరణలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎం ఈ పార్కులను ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగమన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో వర్చువల్ మాట్లాడారు. ఇప్పటి నుంచే వినూత్న ఆవిష్కరణల దిశగా ప్రయత్నించాలని సూచించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, జెసి ఫర్మాన్ అహ్మదాఖాన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జి.సిగడాం రూరల్ : మండలంలోని సంతవురిటిలో రూ.వంద కోట్లతో నిర్మాణం చేపట్టనున్న బయోగ్యాస్ ప్లాంట్‌కు ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిపిఒ సౌజన్య భారతి, తహశీల్దార్ ఎం.సరిత, ఎంపిడిఒ జి.రామకృష్ణ, సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, ఎఎంసి ఉపాధ్యక్షుడు బూరాడ వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షుడు బెవర జగన్నాథరావు, సర్పంచ్ సాకేటి నాగరాజు, టంకాల మౌళీశ్వరరావు పాత్రో, పివిఎస్ రామ్మోహనరావు, బగాది అప్పలనాయుడు, ఎపిఒ సత్యనారాయణ, ఎఒ యువరాజు,, ఎంఇఒలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సభ్యులు వాకౌట్



వాకౌట్ చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేట మండలంలోని గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు ఉన్న ప్రభుత్వ అధికారులు ఏకపక్ష ధోరణిలోనే ఉన్నారని, ఏ అభివృద్ధిపైనా సమాచారం అడిగినా మౌనం తప్ప సమాధానం లేదని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసి సభ నుంచి వాకౌట్ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఆరంగి మురళి అధ్యక్షతన మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గ్రామస్థాయిలో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులు కనీసం పొలం గట్టుకు రాకుండా ఈ-క్రాప్ నమోదు చేస్తున్నారని అన్నారు. కనీసం మండల స్థాయి అధికారులు పరిశీలన లేకపోవడం ఏమిటని నిలదీశారు. అలాగే వంశధార అధికారులు కూడా కాలువల పనులు పూర్తి చేయిక రైతులు ఇబ్బందులు పడుతు న్నామని తెలగవలస ఎంపిటిసి ఆరోపించారు. దేవాది సర్పంచ్ మంతిని రాము విద్యుత్ సమస్య లపై ఆరు నెలలుగా తెలియజేసినా సంబంధిత అధికారులు స్పందించడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. అన్నిశాఖల పనితీరు అలాగే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించని సమావేశం ఎందుకని వాకౌట్ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరప్రసాద్, తహశీల్దార్ సత్యనారాయణ, ఎఎంసి చైర్మన్ పి.ఉమామహేశ్వరి, జెడ్‌పిటిసి ప్రతినిధి చింతు రామారావు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఒంటరి మహిళలే లక్ష్యం

● చైన్‌స్నాచర్ అరెస్టు ● రూ.10 లక్షలు బంగారం స్వాధీనం - ఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఒంటరి మహిళలే లక్ష్యంగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన చైన్ స్నాచింగ్ కేసులో పట్టుబడిన నిందితుడు కాశీబుగ్గ, కవిటి, మందస, ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్లకు సంబంధించిన కేసుల్లో నేరం అంగీకరించినట్టు వెల్లడించారు. ఈ మేరకు జిల్లా ఎస్‌పి కార్యాలయంలో కేసు వివరాలను మంగళవారం వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలు కేసుల్లో చోరీ సొత్తుని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితుడు ఒంటరిగా ఉన్న మహిళల మెడలో ఉన్న బంగారు ఆభరణాలు తెంపి నేరాలకు పాల్పడడం నేర ప్రవృత్తి అని చెప్పారు. నిందితుడు ఒడిశా రాష్ట్రం మహేశ్వర్ దళాయ్‌ది తరస్ ప్రాంతానికి చెందిన వాడని అన్నారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో ఈ నెల 14న కోసంగిపురం కూడలిలో మహిళ తన టీ షాప్ వద్ద గ్యాస్ స్టవ్ వెలిగిస్తుండగా... వెనుక నుంచి మోటార్ సైకిల్‌పై వచ్చి మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని వెళ్లిపోయాడని అన్నారు. ఇదే పోలీస్ స్టేషన్‌లో జనవరి 9న పలాస నుంచి తనఊరు జగన్నాథపురం మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మార్గంమధ్యలో తర్లకోట దగ్గరకు వెళ్లేసరికి నిలబడి ఉండి ఫిర్యాదుదారని లిఫ్ట్ అడిగిందన్నారు. కొద్ది దూరం వెళ్లిన తరువాత ముద్దాయి తనవారు వస్తున్నారు... బండిని ఆపమని చెప్పగా, ఫిర్యాది బండి ఆపిందన్నారు. ఫిర్యాది కుడిచేతికి ఉన్న సుమారు తులం బంగారు బ్రెసిలెట్‌ను తెంపుకొని పారిపోయాడని చెప్పారు. కవిటి పిఎస్ పరిధిలో గత నెల 25న స్కూటీపై పలాస వైపు వెళ్తున్న మహిళ మెడలోని మూడు తులాలు పుస్తల తాడు తెంపి బైక్‌పై వెళ్లిపోయాడని చెప్పారు. మందస పిఎస్ పరిధిలో గత నెల 9న పాన్‌షాపులో ఉన్న మహిళను కూల్ డ్రింగ్ అడిగి, వెనకు నుంచి తులం బంగారం చైను తెంపుకొని పారిపోయాడని తెలిపారు. ఇచ్ఛాపురం రూరల్ పిఎస్ పరిధిలో ఈ నెల 8న జరడా కూడలి వద్ద కూర్చొని ఉండగా ముద్దాయి మోటార్ సైకిల్‌పై వచ్చి ఫిర్యాది మెడలో ఉన్న తులం బంగారు చైన్‌ను తెంపుకొని బైక్ వెళ్లిపోయాడని చెప్పారు. నిందితుడు మహేశ్వర్ దళాయ్ ఇంటర్మీడియట్ వరకు చదుకున్నట్టు తెలిపారు. కూలి పనులు చేస్తూ మద్యం తాగడం, పేకాట ఆడడం, ఖైనీ, గుట్కా వంటి అలవాట్లులో పాటు, సినిమాలు చూడటం, జల్సాగా తిరగడం వంటి విలాస అలవాట్లు వల్ల దొంగతనం చేయటానికి అలవాటు పట్టాడని వివరించారు. ఒడిశాలోని దిగపండా పోలీస్ స్టేషన్ ఏరియాలో ఒంటరిగా వెళ్తున్న వ్యక్తి వద్ద క్యాష్ బాగ్‌ను లాక్కొని వెళ్లిపోయిన కేసులో జైలుకు వెళ్లి వచ్చారని అన్నారు. ఈ కేసు ఛేజించిన డిఎస్‌పి డి.లక్ష్మణరావు, కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ నరసింహమూర్తి, హెడ్ కానిస్టేబుల్ గవరయ్య, కానిస్టేబుళ్లు ఉషాకిరణ్, నీలకంఠం, కోరు సిబ్బంది శ్రీధర్, సత్యనారాయణలను అభినందించారు.

జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ


ఢిల్లీలో చోటుచేసుకున్న పేలుడు ఘటన నేపథ్యంలో జిల్లా పరిధిలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ అప్రమత్తమైంది. ఈ మేరకు సోమవారం ఆర్ధరాత్రి విస్తృతంగా లాడ్జిలు, వాహనాల తనిఖీలు చేశారు. ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి పర్యవేక్షించారు. నగర, గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, రద్దీ ప్రదేశాల్లో, కూడళ్లు, టోల్‌గేట్లు, బైపాస్ రోడ్లు, రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను నిలుపుదల చేసి పత్రాలు, నవంబరు ప్లేట్లు, లైసెన్సులు పరిశీలించారు. లాడ్జిలు, బస్సు, రైల్వే స్టేషన్లలో కొత్త వ్యక్తుల వివరాలు సేకరించి, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా పెట్టారు. వరైనా అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనిస్తే వెంటనే డయల్ 112 ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు.

రైల్వేస్టేషన్‌లో...

ఆమదాలవలస : దేశ రాజధాని న్యూఢిల్లీ ఎర్రకోట వద్ద సోమవారం జరిగిన బాంబు పేలుళ్ల ఘటనతో నేపథ్యలో శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లో జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్ పోలీసులు భద్రతా తనిఖీలను కట్టుదిట్టం చేశారు. స్టేషన్ ప్రాంగణంలోకి ప్రవేశించే ప్రయాణికుల వద్ద ఉన్న లగేజీ బ్యాగులు, వాహన పార్కింగ్ ప్రాంతంలో నిలిపిన బైకులు, ఆటోలు, కార్లను సిబ్బంది నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌పిఎఫ్ ఒసి ఎస్.కాంతారావు, ఎస్ఐ నాయక్, జిఆర్‌పి ఎస్ఐ మధునరావు పర్యవేక్షణలో రైలు బోగీలు, వెయిటింగ్ హాల్స్ ప్లాట్‌ఫారాలు, టిక్కెట్ కౌంటర్ పరిసరాలను సమగ్రంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు గమనించిన వెంటనే సమీప పోలీసు సిబ్బందికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



ఆమదాలవలస : రైల్వే స్టేషన్‌లో బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న రైల్వే పోలీసులు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డిసెంబరు 13న జాతీయ లోక్ ఆదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా కోరారు. ఈ మేరకు కోర్టు ఆవరణలో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో, న్యాయవాదులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాలు మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం లక్ష్యంగా న్యాయవాదులు ముందుకు సాగాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం, లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. కేసుల్లో జాప్యం ఉండకుండా పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, జిల్లా రెవెన్యూ ఇన్‌ఛార్జి అధికారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

యువత ప్రతిభను కనబరచాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

యువత తమ ప్రతిభను కనబరచుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని మునసబుపేటలోని గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీలో మంగళవారం సెట్‌శ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవ పోటీలు ఎమ్మెల్యే శంకర్ అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు యువజనోత్సవాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని, యువత దేశానికి దిక్సూచని కొనియాడారు. యువతలో పోటీతత్వం మరింత పెరగాలని, సామాజిక బాధ్యత ఉండాలని, భూగర్భజలాలు పెంపొందించు కోవాలంటే నీటిని సంరక్షించుకుని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక పోటీలు 15 నుంచి 29 ఏళ్లు గల యువతీ, యువకులకు జానపద బృంద నృత్యం, జానపద బృంద గీతాలు, స్టోరీ రైటింగ్, కవిత్వం, చిత్రలేఖనం, ప్రసంగాలపై పోటీలు నిర్వహిస్తోందని, జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం పొందిన వారు ప్రభుత్వ ఖర్చులతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానం పొందిన వారు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనుటకు ప్రభుత్వమే ఖర్చులు భరిస్తుందన్నారు. జాతీయస్థాయిలో గెలుపొందిన వారు ప్రధాన మంత్రితో జరిగే ముఖాముఖి కార్యక్రమంలో యువత ఉద్దేశాలు, సూచనలు చెప్పాల్సి ఉంటుందన్నారు. సెట్‌శ్రీ సిఇఒ వి.వి. అప్పలనాయుడు మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో పాల్గొన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వయోజన విద్య ఉప సంచాలకులు సోమేశ్వరరావు, పర్యాటక అధికారి నారా యణరావు, మై భారత్ శాఖ డిడి ఉజ్వల్, గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరక్టర్ సంయుక్త, గురజాడ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రిన్సిపాల్ కెవివి సత్యనారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వై.పోలినాయుడు, సెట్‌శ్రీ సిబ్బంది, స్కూల్స్, కెజిబివి, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

ఇదేనా స్వచ్ఛ శ్రీకాకుళం?



జిటి రోడ్డులో విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న చెత్త డబ్బా

ప్రజాశక్తి- అరసవల్లి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్, స్వచ్ఛఆంధ్ర అంటూ కేవలం ఫోటోలకు మాత్రమే పరిమితమై ప్రచారం చేసుకోవడానికి తప్ప స్వచ్ఛత అనేది ఎక్కడా కనిపించడం లేదు. గతంలో చెత్త ఎక్కడో ఒక మూలాన వేస్తే దానిని నగరపాలక సంస్థకు చెందిన వాహనాలపై ఎక్కించుకొని జనావాసాలు లేని సుదూర ప్రాంతాలకు తరలించి పడవేసేవారు. ఎప్పటికప్పుడు పరిశుభ్రత కనబడేది. అయితే ఇప్పుడు ప్రతి జంక్షన్‌లో చెత్త డబ్బాలను ఉంచడం వలన ఆ చెత్త డబ్బాల్లో ఆ వీధిలో ఉన్న ప్రజలు ఆ చెత్త డబ్బాల్లో పోగులుపోగులుగా పాలధిన్ కవర్లతో చెత్తలు వేయడంతో ఆ కవర్లలో ఉన్న ఆహార పదార్థాలు తినటానికి పశువులు, కుక్కలు ఎగబడటం వలన ఆ చెత్త కవర్లన్నీ రోడ్డుపైనే పడవేయడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసనతో ఉండడం వలన అటుగా వెళ్తున్న వాహనదారులు, ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతూ ముక్కుమూసుకొని వెళ్లే పరిస్థితి ఎదురవుతుంది. వారం రోజులకు ఒకసారి నగరపాలక సంస్థ వాహనంపై ఎక్కించుకొని ఆ చెత్తను దూరంగా తీసుకెళ్తూ ఉంటారు. కానీ ఈ వారం లోపల ఆ చెత్తను పశువులు, కుక్కలు రోడ్లుపైన చెల్లా, చెదురుగా పడవేసి అపరిశుభ్రత చేస్తుంటాయి. వీటివలన అనేక ప్రమాదాలు కూడా అప్పుడప్పుడు జరుగుతూ ఉన్నాయి. ఈ చెత్త డబ్బాలు ఎక్కడో ఒక మూలన గాని, రహదారి సరిహద్దు దాటి గాని పెట్టాలని ప్రజలు ఎన్నోసార్లు నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేసినా నగరపాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఈ చెత్త డబ్బాల్లో ఉన్న కొన్ని పాలిథిన్ కవర్లను పశువులు తినటం వలన అనేక పశువులు వ్యాధుల బారిన పడి చనిపోయే పరిస్థితి ఎదురవుతుంది. ఈ చెత్త డబ్బాలను, అపరిశుభ్రతంగా ఉన్న ప్రాంతాన్ని చూస్తూ వెళ్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది, అధికారులు పట్టీపట్టనట్లు ఉంటున్నారు.



చెత్త డబ్బా వద్ద చెత్తను రోడ్డుపైకి లాగేసిన పశువులు (ఫైల్)

చెత్త డబ్బాలు రోడ్డుపై వద్దు

చెత్త డబ్బాలను రైతుబజార్, చిన బజారు, పుణ్యపువీధి, ముద్దాడ చినబాబు ఆస్పత్రి ఎదురుగా, డగ్లస్ స్కూల్ ఎదురుగా, ప్రతి జంక్షన్‌లో ఏర్పాటు చేయగా ఈ చెత్త డబ్బాల వలన అపరిశుభ్రత ఎక్కువై ఇబ్బందులకు గురవుతున్నట్లు ప్రజల ఆవేదన వెలుబుచ్చుతున్నారు. నగరపాలక సంస్థకు చెందిన చెత్త డబ్బాలు రోడ్డుపైన కాకుండా ఏదైనా ఒకవీధి సందు చివరిలో వాహనదారులకు ఆటంకం లేకుండా, ఎవరికి ఇబ్బంది లేకుండా ఉండేటట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



పిఒతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

గిరిజన గ్రామాల అభివృద్ధిపై చర్చ

మెళియాపుట్టి: ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి స్వప్నిల్ పవర్ జగన్నాథ్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తమ నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధి, రహదారులు, విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల విస్తరణపై విస్తృతంగా చర్చించారు. గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం నుంచి మరింత మద్దతు లభించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటిడిఎ పిఒ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

పలాస: గ్రామాల అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని బొడ్డపాడులో జైభీం యువజన సంఘం 31వ వార్షికోత్సవ సందర్భంగా రాగోలు జెమ్స్, గ్రేట్ ఈస్టర్న్ మెడికల్ స్కూల్ ఆధ్వర్యాన ఉచిత కేన్సర్ స్కానింగ్, మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతంలో పట్టిపీడిస్తున్న కిడ్నీ వ్యాధిపై ప్రతి ఆరు నెలలకొకసారి మందస్తు పరీక్షలు చేయించుకుంటే, వ్యాధిని ముందుగానే గుర్తించి తగు చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్ పోటీలు, వివిధ సాంసతిక కార్యక్రమాలను నిర్వహించారు. పీరుకట్ల విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షులు కుత్తుమ లక్ష్మణకుమార్, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కిరి ఢిల్లీరావు, బొడ్డు సుధాకర్ పాల్గొన్నారు.

గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలి

శ్రీకాకుళం రూరల్: పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాలు చెత్త చెత్తరాలు లేకుండా పరిశుభ్రంగా ఉండాలని జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ అన్నారు. మండలం గూడెంలో ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్, పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి చెత్తాచెదారాలను బయట పడేయకుండా పారిశుధ్య సిబ్బంది వచ్చినపుడు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ చుట్టు ఉండే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉండాలన్నారు. చెత్త నుంచి సంపద వచ్చేందుకు ప్రభుత్వం సంపద కేంద్రాలను ఏర్పాటు చేసిందని, దాని ద్వారా పంచాయతీలకు ఆదాయం చేకూరుతాయన్నారు. ఆయనతో పాటు ఎంపిడిఒ ప్రకాశరావు, ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

పిపిపి వ్యతిరేక ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ

పలాస : కాశీబుగ్గ వైసిపి కార్యాలయంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు మంగళవారం పోస్టర్ ఆవిష్కరించారు. బుధవారం ఉదయం 10 గంటలకు భారీ ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దువ్వాడ రవి కుమార్, పాలిన శ్రీనివాసరావు, చింతాడ మాధవరావు, బి.సుధాకర్, తామడ మధన్, కోరాడ ధనరాజ్, గొండు మోహన్ పాల్గొన్నారు.

కెజిబివి పరిశీలన

ఇచ్ఛాపురం : పట్టణంలో బెల్లుపడలో ఉన్న కెజిబివిని ఎంఇఒ అప్పారావు మంగళవారం పరిశీలించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులో మోటివేషన్ అండ్ ఎగ్జామినేషన్ ప్రిపరేషన్ టిప్స్ అందించారు. అలాగే పాఠశాలలో కిచెన్, మెనూ, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శిరీష పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

టెక్కలి రూరల్ : ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం ఉదయం 10 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ కోరారు. టెక్కలి పురవీధుల్లో భారీ ఎత్తున ర్యాలీ నిర్వస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, కార్యకర్తలు పాల్గొవాలని కోరారు.

టిడిపి పట్టణ అధ్యక్షునిగా రంగారావు

కవిటి: కవిటి పంచాయతీ టిడిపి పట్టణ అధ్యక్షునిగా వజ్జ రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఉపాధ్యక్షునిగా శటగోపం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నెయ్యల శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా లక్ష్మణ్ బెహరా, కోశాధికారిగా తామాడ రోజా ఎన్నికయ్యారు. వీరికి టిడిపి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

సంతకాల సేకరణ

నరసన్నపేట : ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నరసన్నపేట నియోజకవర్గం లీగల్ సెల్ ఆధ్వర్యాన మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. సంతకాలు చేసిన పత్రాలను వైసిపి కార్యాలయంలో పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్యకు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు గొలివి గణేష్, గొండు సత్యం అందజేశారు.

స్మార్ట్ కిచెన్‌లను రద్దు చేయాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

స్మార్ట్ కిచెన్ పెట్టాలనే ఆలోచనను వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఎంఇఒ కె.పున్నయ్యకు మధ్యాహ్న జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టి.కళావతి, ఎస్.పార్వతి, వై.రూపావతి, ఎన్.నీలవేణి, ఎల్.ముత్యాలమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ కిచెన్ అమలు చేయడం ద్వారా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీసం రూ.10 వేలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 9,10వ తరగతులకు వండి పెడుతున్న కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా స్కూల్ విద్యార్థులకు రూ.20 ఇవ్వాలన్నారు. కాలేజీ విద్యార్థులకు రూ.60 ఇవ్వాలన్నారు. వంట చేసే సమయంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, స్కూళ్లల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలన్నారు.



ఎచ్చెర్ల : వినతిపత్రం అందజేస్తున్న మహాలక్ష్మి



పలాస : వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

పలాస : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు, విద్యార్థులకు నష్టం కలిగించే స్మార్ట్ కిచన్‌లను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి డిమాండ్ చేశారు. ఎంఇఒ చెరుకుపల్లి సత్యంను మంగళవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో పి.భూదేవి, బి.శశిరేఖ, వై.మణమ్మ, కె.మహాలక్ష్మి, వసంత, గౌరమ్మ, జ్యోతి ఉన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని చీడివలస గ్రామానికి చెందిన మజ్జి రామస్వామి (75) గడ్డిమందు తాగి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మజ్జి రామస్వామి భార్య మూడు ఏళ్ల కిందట మృతి చెందింది. దీంతో మానసికంగా కృంగిపోయిన రామస్వామి సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. విషయం తెలుసుకున్న రామస్వామి కుమారుడు వెంకట రమణమూర్తి 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రామస్వామి మంగళవారం ఉదయం మృతి చెందాడని కుమారుడు వెంకట రమణమూర్తి తెలిపాడు. రమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవళ్లిక తెలిపారు.

మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నాగావళి నదిలో ఆదివారం స్నానానికి దిగి గల్లంతైన యువకుడు ఉదయ్ (20) మృత దేహం మంగళవారం బయట పడింది. పొన్నాడ వంతెన సమీపంలో నదిఒడ్డున మృతదేహం లభ్యమైంది. గత రెండు రోజులుగా ఫైర్, రెస్క్యూ బృందాలు మృతదేహం కోసం గాలిస్తున్నాయి. మొదటి పట్టణ ఎస్ఐ హరికృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేపడుతున్న డిఎల్‌పిఒ గోపిబాల

ప్రజాశక్తి- జి.సిగడాం రూరల్

పంచాయతీ జమ, ఖర్చులకు సంబంధించిన విచారణ గామస్తుల సమక్షంలో చేపట్టాలని ఫిర్యాదుదారులు కోరారు. ఇటీవల గ్రామానికి చెందిన గార శివ ప్రసాద్, డోల భాను, డోల వెంకటేష్ తదితరులు పెంట గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ పిజిఆర్ఎస్ వేసి ఫిర్యాదుతో డిపిఒ ఆదేశాల మేరకు మంగళవారం పెంట గ్రామ సచివాలయంలో డిఎల్‌పిఒ గోపిబాల విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు శివకుమార్ ఆన్‌లైన్‌లో పొందుపర్చిన పంచాయతీ లావాదేవిలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరగా అందుకు డిఎల్‌పిఒ పంచాయతీ రికార్డుల మేరకు మాత్రమే విచారణ చేపట్టడం జరుగుతుందని, ఆన్‌లైన్‌లో ఉన్న వివరాలు పరిగణలోకి తీసుకోవడం జరగదన్నారు. ఆఫ్‌లైన్ రికార్డుల ప్రకారం విచారణ చేపడితే న్యాయం జరగదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తామన్నారు. సమాచారం ఇవ్వకుండా గ్రామసభలు గుట్టుచప్పుడుగా నిర్వహించి, ఇష్టం వచ్చినట్లు రికార్డుల్లో జమ, ఖర్చులు పొందుపర్చు కుంటున్నారని వారు డిఎల్‌పిఒ దృష్టికి తీసుకువచ్చారు. విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు. పలు రికార్డులను డిఎల్‌పిఒ తన వెంట తీసుకువెళ్లారు. ఈయనతో పాటు సర్పంచ్ పున్నాన సోనియా, కార్యదర్శి దుర్గారావు తదితరులున్నారు.



మందులను అందజేస్తున్న వైద్య సిబ్బంది

పొందూరులో వైద్యశిబిరం

పొందూరు: పట్టణంలోని నాయుడువీధిలో తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా. నవీన్‌కుమార్, లకినేన అనూష ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడువీధికి చెందిన సుమారు 75 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాయి మెడికల్ యాజమాని, మాజీ ఎంపిటిసి కోరుకొండ సాయికుమార్ సుమారు రూ.10వేలు విలువచేసే వివిధ రకాల మందులను ఉచితంగా అందజేశారు. అలాగే రెండేళ్ల చిన్నారులకు అవసరమైన విటమిన్ డి డ్రాప్స్‌తో పాటు కడపునొప్పికి సంబందించిన చుక్కల మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెన్‌కో డైరెక్టర్ భాషా ఆనందమోహన్, వైద్య, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతను ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

అన్నదాతను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని ఉప్పినివలసలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల మొంథా తుపాను కారణంగా పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న రైతులకు, చేనేత కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం హర్నిశలు కృషి చేస్తుందన్నారు. తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం సిఎం చంద్రబాబు రాష్ట్రంలో కొన్ని లక్షలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారని, అలాగే రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. గ్రామంలో నిరుపేదలైన చేనేత కార్మికులు సుమారు 20 కుటుంబాలు వారున్నారని, మంత్రి నారా లోకేష్ ఇటీవల విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో స్థానిక చేనేత కార్మికులు నేసిన బట్టలను మెచ్చుకున్నారని, వీరికి ప్రభుత్వం తరపున చేయూతని అందిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవ కాశం ఉంటుందని ఆర్ఫ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నూక సన్యాసి రావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ చేనేత కార్మికులకు తమవంతు కృషి చేస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, సర్పంచ్‌లు శ్రీదేవి, శ్రీనివాసరావు, గని రాజు, గోపి మాస్టారు, ఇప్పిలి సిమ్మన్న, వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, ఎంపిటిసిలు చొక్కార పోలినాయుడు, తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఒ తిరుపతిరావు అధికారులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో మొంథా తుపాను వల్ల నష్టపోయిన 91 మంది చేనేత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేసిన 50 కేజీల బియ్యం కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుపాను సమయంలో పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు పనిలేక నష్టపోయిన మత్స్యకారులకు నిత్యావసర సరుకులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నష్టపోయిన చేనేత కార్మికులనూ ఆదుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వారికి లబ్ధి చేకూరిందన్నారు. మరి కొంతమంది చేనేత కార్మికులకు నిత్యావసర సరుకులు అందించాల్సి ఉందని, త్వరలో వారికీ అందజేస్తామని తెలిపారు. త్వరలో రోజుల్లో విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా తయారవుతుందని, అలాగే అమరావతిలో ప్రతిష్టాత్మక కంపెనీలు ఏర్పాటు కాబోతున్నాయని అన్నారు. దీని ద్వారా యువతకు ఉద్యోగాలు పెద్ద ఎత్తున లభించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజు, సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, గొండు రమణ, ఎంపిటిసి అన్నెపు భాస్కరరావు, తహశీల్దార్ రాంబాబు, ఎంపిడిఒ వెంకటరావు పాల్గొన్నారు.

పొందూరు: మొంథా తుపాను ప్రభావంతో చేనేత కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన నిత్యవసర సరుకులను టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్ అందజేశారు. మండలంలోని కనిమెట్ట, పొందూరు, తోలాపి, తండ్యాం, మలకాం, తాడివలస గ్రామాల్లో సుమారు 314 చేనేత కార్మిక కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, టిడిపి పట్టణ అధ్యక్షుడు చిన్నరంగా, మాజీ సర్పంచ్ అన్నెపు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు దండా మురళీ, కూటమి నాయకులు కృష్ణమూర్తి, దండా రవి, కాలెపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయలక్ష్మి



విజయలక్ష్మి

పొందూరు: ఆంధ్రప్రదేశ్ నాగవంశం సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పొందూరు పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయ లక్ష్మిని ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను డైరెక్టర్‌గా నియమించిన సిఎం చంద్రబాబునాయుడుకి, స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలను తెలిపారు. నాగవంశం సంక్షేమానికి, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈమె నియామకంపై టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, టిడిపి పట్టణ అధ్యక్షులు అనకాపల్లి చిన్నరంగా, ఎంపిటిసిలు అనకాపల్లి వాణి, బాడాన హారిక, టిడిపి నాయకులు కాలెపు శ్రీనివాసరావు, దండా రవి, దండా మురళీ తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

26 మందిపై బైండోవర్

వజ్రపుకొత్తూరు: మండలంలోని మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్న 26 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని కాశీబుగ్గ ఎక్సైజ్ సిఐ కె.మల్లిఖార్జునరావు తెలిపారు. ఈ మేరకు 26 మందిపై తహశీల్దార్ డి.సీతారామయ్య ఎదుట మంగళవారం హాజరుపర్చి బండోవర్ కేసు నమోదు చేశారు. దీనిని అతిక్రమించి బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు చేపడితే రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇంకా ఎవరైనా మద్యం షాపులు నిర్వహించి విక్రయాలు చేపడితే కేసులు నమోదు చేసి, బెల్టు షాపులకు విక్రయించిన లైసెన్స్ దారునిపైనా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నోటీసులు జారీ చేసి చట్టపరంగా షాపు లైసెన్స్ సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు చేపడితే తక్షణమే 14405కు సమాచారం అందించాలని కోరారు.



బైండోవర్ చేస్తున్న తహశీల్దార్ సీతారామయ్య

ఆరేళ్లు దాటినా మోక్షం లేదా?



లావేటిపాలెంలో పిల్లర్లు దశలో ఉన్న సచివాలయ భవనం

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు పంచాయతీలోని లావేటిపాలెంలో లావేరు సచివాలయం-2 అరేళ్లపైగా పిల్లర్లు దశ మించి పనులు జరగలేదు. గత వైసిపి పాలనలో 2020లో అప్పటి ఎమ్మెల్యే చేతులమీదగా శంకుస్థాపన పనులు జరిగి పునాదులు దశకు మించి పనులు జరగపోవడంతో ఇటీవల ప్రజాశక్తిలో కథనం రావడంతో సంబంధిత కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి తెచ్చి పునాదులు నుంచి పిల్లర్లు వరకు పనులు చేసి మళ్లీ అర్థాంతరంగా నిర్మాణం పనులు నిలిచిపోవడంతో మళ్లీ సమస్య మొదటికే వచ్చింది. ఇక్కడ సచివాలయం భవనం ఇరుకుగదిలో అద్దె భవనంలో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఆ భవనం యజమాని ఓ ప్రేవేటు బ్యాంకులో భవనంపై రుణం తీసుకోవడంతో ఆయన ఇక్కడ లేకపోవడంతో వాయిదాలు చెల్లించకపోవడంతో బ్యాంకు వారు ఇటీవల ఆ భవనాన్ని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. మరోవైపు ఇరుకుగదిలో తమ విధులు నిర్వర్తించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సచివాలయం భవనం నిర్మాణ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందుల నుంచి విముక్తి కలిగించాలని వారంతా కోరుతున్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఎస్‌పి కె.వి. మహేశ్వర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన సేవలను స్మరించుకున్నారు.

అరసవల్లి: పట్టణంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు, సంఘ సంస్కర్తల స్మృతివనంలో మౌలానా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పైడి హరనాథరావు, నిక్కు అప్పన్న, ముస్లిం ప్రతినిధి బృందం ముజీబ్, షాన్‌వాజ్, సుక్రుఖాన్, సలీమ్, సయ్యద్ షఫీ, షేక్‌యాసిమ్, మహిబుల్లాఖాన్, వి. జగన్నాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్-ఎస్ పిఒ జె.పాపారావు, సిబ్బంది జి.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాది నాయుడు పాల్గొన్నారు.



శ్రీకాకుళం సిటీ : నివాళ్లర్పిస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ఇచ్ఛాపురం : స్థానిక శాంతినికేతన్ విద్యా సంస్థలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూరి, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, శంకర్, పద్మజ, శ్రీధర్, శాంతి, రాజ్యలక్ష్మి, జయలక్ష్మి, రవి, మీనా, స్నేహ, పార్వతి, సరోజిని, ప్రమీల, కీర్తి, ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్‌ప్రియా, సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి, జిహారిక, యువశ్రీ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని గోపీనాధ పురం పంచాయతీ పరిధిలో విద్యుత్ స్తంభాలు తీగలు ప్రమాదకరంగా పరిణ మిస్తున్నాయని కూటమి నాయకులు మదనలాల జోగారావు, మదనాల మోహన్ అన్నారు. మదనాల సత్యం ఇంటి ముందు నుంచి వెళ్తున్న తీగలు భూమికి చాలా దగ్గరగా మనుషులకు తగిలే విధంగా వేలాడు తున్నాయని తెలిపారు. పొరపాటున చెయ్యి ఎత్తితే విద్యుత్ తీగలు తగులుతాయని, దీనివల్ల ప్రమాదాలు సంభవిస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లోకి వెళ్లే సమయంలో ఇంటికి అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలు వల్ల ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. వ్యవసాయ పనిముట్లు, ఇతర పెద్ద వస్తువులు ఇంటిలోకి తీసుకెళ్లాలంటే భయమేస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీలో మెళియాపుట్టి, చిన్నగోపీనాథపురం, అమలపాడు కూడలి, నాయుడు తోట, అదయ్య గారి తోటలు. రాయల్ స్ట్రీట్, గ్రామదేవత గుడి ఏరియా, యంపల్లికాలనీ, దాసరివాని కోటలు, కంచుకోట, మల్లెనవారితోటలు, బొడ్డు వానితోటలు, మెలియాపుట్టి సింహద్వారం వద్ద సుమారు 15 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని అన్నారు. కొన్నిచోట్ల ఎల్‌టి లైన్ బాగా కిందికి వేలాడి ఉన్నాయని తెలిపారు. వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయని తెలిపారు. ఏ సమయంతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు దినదిన గండంగా బతుకుతున్నారని తెలిపారు. దీనిపై మండల విద్యుత్‌శాఖ అధికారులకు మీకోసంలో వినతిపత్రం అందించినా ఇంత వరకు స్పందన లేదని అన్నారు. ఇటీవల ఒక విద్యుత్ స్తంభం ఇంటిపైన కూలిన సంఘటన గుర్తు చేశారు. ఇలాంటి సంఘటన పునరావృవం కాకుండా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



ఇంటి ముందు ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు


జెండా ఊపుతున్న విప్ అశోక్

యాత్రికులకు విప్ ఆతిథ్యం

ప్రజాశక్తి- కవిటి

ప్లాస్టిక్ ఫ్రీ కార్యక్రమంలో భాగంగా సుమారు 2500 కిలో మీటర్లు ప్రయాణించిన యాత్రికులకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మంగళవారం తన నివాసంలో ఆతిథ్యం ఇచ్చారు. కుప్పం నుంచి ఆంధ్రప్రదేశ్ తూర్పు తీర ప్రాంతం మొత్తం పర్యటిస్తూ 'పాజిటివిటీ, ప్రోగ్రెస్, ప్రైడ్ ఆఫ్ ఆంధ్రా' అనే థీమ్‌తో బయలుదేరిన ముగ్గురు రైడర్లు ఆర్.శివ, ఉపేంద్ర, లక్ష్మీపతి తమ తుది గమ్యం ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా విప్ తన నివాసంలో రైడర్లను సన్మానించారు. అనంతరం రైడర్ల తిరుగు ప్రయాణానికి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైడర్లు మాట్లాడుతూ 'పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడూ బాధ్యత. ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతిఒక్కరూ చైతన్యవంతులు కావాలి' అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్, పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, జడ్ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాస రౌళో, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌళో, పుల్లట సంతోష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టదా?

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని గొర్లెపాడు పంచాయతీలో ప్రభుత్వ భూములు, చెరువులు, కాలువలు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని సిపిఐ నాయకులు విమర్శించారు. మంగళవారం గొర్లపాడు గ్రామాన్ని సందర్శించిన భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణ స్వామి, పక్కళ్లి అరేలమ్మ మాట్లాడుతూ గతంలో పలుమార్లు కలెక్టర్, ఆర్‌డిఒ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఇప్పటి వరకు సర్వే చేపట్టలేదన్నారు. సర్వే చేస్తామంటూనే వాయిదాలు వేస్తున్న అధికారులు ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించకపోతే స్థానిక ప్రజలతో క్షేత్రస్థాయికి వెళ్లి ఎర్రజెండాలు ఎగురవేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంటి లోకనాథం, సర్పంచ్ వల్లభరావు, సుదర్శన్, పద్మనాభం, మాధవరావు పాల్గొన్నారు.


పనులకు శంకుస్థాపన చేస్తున్న స్వర్ణమణి

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి కాంట్రాక్టరు నారాయణ రెడ్డికి సూచించారు. మున్సిపాలిటీ ఏడో వార్డు పరిధిలోని గాదివారి వీధి ఆలయం నుంచి రూ.5 లక్షలలో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి లాభాల శంకర్‌కుమార్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ కిషోర్, అమినిటిస్ సెక్రటరీ పృథ్వీ, వైసిపి వార్డు ఇన్‌చార్జి పటన నీలాద్రి, ఎ.సత్యం, పి.కృష్ణ, పి.హరికృష్ణ, నందికి సోమేష్, లక్ష్మణరావు, మోహనరావు పాల్గొన్నారు.


ధ్రువపత్రాలను అందజేస్తున్న డివిఇఒ సురేష్‌కుమార్

ఒకేషనల్ విద్యార్థుల శిక్షణ పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వృత్తి విద్య కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఆన్ ది జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) ఎంతో ఉపయోగకరమని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి రేగ సురేష్ కుమార్ తెలిపారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిషరీస్ విభాగానికి చెందిన విద్యార్థులు జిల్లా కేంద్రంలోని మత్స్యశాఖలో పొందుతున్న క్షేత్రస్థాయి శిక్షణను జిల్లా కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం పరిశీలించారు. జిల్లా కమిటీ సభ్యులు బి.శ్యామ్‌సుందర్, దుగ్గివలస రాంప్రసాద్, ఫిషరీస్ అధ్యాపకులు ఎం.వి.రమణమూర్తి, టి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మత్స్యశాఖకు చెందిన అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాలపై డిప్యూటీ డైరెక్టర్ చింతాడ సత్యనారాయణ విద్యార్థులకు వివరించారు. డాక్టర్ పొన్నాడ వెంకటబాబు, ఎఫ్‌డిఒ ముసలినాయుడు పాల్గొనగా, ఇటీవల శిక్షణ పొందిన విద్యార్థులకు ధ్రువపత్రాలను డివిఇఒ అందించారు.

విద్యార్థులకు వివేకానందుని స్మారక అవార్డులు

సోంపేట: సోంపేట రామకృష్ణ సేవా సమితి ద్వారా ఇటీవల 'వివేకానందుని చికాగో ఉపన్యాసం విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై వార్షిక వ్యాసరచన పోటీలు నిర్వహించడం తెలిసిందే. ఈ పోటీల్లో కొర్లాం బాలకృష్ణ కాలేజీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. కళాశాలకు చెందిన సంతోసి, గాయత్రి విజేతలుగా నిలవగా, వారితోపాటు మధుసూదన్ మహంతి, సాయిన స్వప్న, బతకల అనూప, బతకల శ్రీకక్ష, మద్దిల కీర్తి, బంగారు రోజ, రత్నాల వనశ్రీ, తామాడ ధనలక్ష్మి, సంతోలసి గీతిక, కుద్దిల సావిత్రి, పొందర దివ్య, పెద్దింటి వినయలకు ప్రోత్సాహక బహుమతులు మంగళవారం ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు, సెక్రటరీ జి.శంకరరావు ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆర్.నారాయణ, జి.రామకృష్ణ కె.కాశీపతి, జి.భీమారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


బహుమతులను అందజేస్తున్న స్కూల్ యాజమాన్యం

శాస్త్రీయ సాగుపై శిక్షణ

ఆమదాలవలసశ మండలంలోని బెలమాంలో రైతులకు శాస్త్రీయ సాగుపై ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు మంగళవారం శిక్షణను అందించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో పంటల ఉత్పాదకతను పెంచడం సమర్థవంతమైన సాగు విధానాలు అవలంబించడం సస్యరక్షణ చర్యలపై స్పష్టమైన అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చిట్టిబాబు రైతులకు వరి పంటలు అనుసరించాల్సిన సస్యరక్షణ చర్యలు, పంటకోత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షుణ్ణంగా వివరించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రబీ పంట కాలానికి అనుకూలంగా పెసర, మినుము పంట రకాల ఎంపిక వాటి సాగు విధానాలు రోగాల నియంత్రణ ఎరువుల వాడకంపై సమగ్ర సూచనలు అందజేశారు. అపరాల పంటల్లో తలెత్తే వ్యాధులు కీటకాలు వాటి నియంత్రణ చర్యలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. పంటల నష్టాలను తగ్గించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో వ్యవసాయం చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చునని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనుగుల కిషోర్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ అధికారి ఎల్.విజయ, మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు గురుగుబెల్లి తేజేశ్వరరావు పాల్గొన్నారు.


శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త చిట్టిబాబు

విద్యార్థినికి నగదు అందజేత

కొత్తూరు : మండలంలోని నివగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023-25లో చదివిన షేక్ కరీనా బేగం ఇంటర్‌లో వెయ్యికి 937 మార్కులు సాధించింది. ఈ మేరకు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా విశాఖలో విశాఖ ఎమ్మెల్యే వెలగపూడి రామకక్రిష్ణబాబు రూ.2 వేలు నగదును, జ్ఞాపకను మంగళవారం అందజేశారు. ఈమెను కళాశాల ప్రిన్సిపాల్ ఆగతముడి సాయిరాం, అధ్యాపకులు టి.ఆదినారాయణ, తిరుపతిరావు, నవీన్, జ్ఞానేశ్వర్‌లు అభినందించారు.

ఎన్ఎంయు జోనల్ కార్యదర్శిగా వాలి

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌డిసి డిపోలో పనిచేస్తున్న పి.వాలి ఎన్ఎంయు జోనల్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆయనను జిల్లా సెక్రటరీ పి.అప్పయ్య ఆధ్వర్యాన డిపోలో మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడమే కాకుండా కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ వి.జి.పతి, పబ్లిసిటీ సెక్రటరీ ఎస్.ఎ.రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.ఎల్.నారాయణ, డిపో ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.ఎన్.రాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎ.వి.రావు, హెచ్.వి.మూర్తి, డి.ఎల్.నారాయణ, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు మాసోత్సవాలు సందర్భంగా ఉమెన్స్ కాలేజ్‌లో విద్యార్థులు క్రమశిక్షణ-కిశోర బాలికలపై ప్రిన్సిపాల్ నవ్యశ్రీ అధ్యక్షతన ఐసిడిఎస్ పిఒ రాజేశ్వరి మంగళవారం అవగాహన కల్పించారు. బాలికలు సమాజంలో ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై మాట్లాడారు. ట్రస్టు చైర్మన్, న్యాయవాది రాంబాబు మాట్లాడుతూ విజయానికి పునాది వేసేది క్రమశిక్షణే అని అన్నారు. ప్రతి విద్యార్థీ తమ తల్లితండ్రుల కష్టాలను అర్థం చేసుకొని బాగా చదువు కుంటూ ఉత్తమ విద్యార్థిగా పేరు తెచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, న్యాయవాది ప్రేమలత పట్నాయక్, చిన్ని భైరి, ధర్మారాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- రణస్థలం

ప్రతి సమస్య పరిష్కార దిశగా కృషి చేస్తానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం రణస్థలం ఎంపీ క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలో ఉన్న ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల నుంచి ప్రజలు, పలువురు నాయకులు వచ్చి పలు సమస్యలపై వినతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు నుంచి తీసుకున్న ప్రతి సమస్య పరిష్కార దిశగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

దత్తత ప్రక్రియపై అవగాహన

ప్రజాశక్తి- బూర్జ

దత్తత మాసోత్సవాల్లో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం దత్తత ప్రక్రియపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లకు, ఎఎన్ఎంఎస్, హెల్త్ సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా అనధికార దత్తత వలన తీసుకునే చట్టపరమైన చర్యలపై వివరించారు. అలాగే ఈ నెలలో జరగనున్న బాలలహక్కుల వారోత్సవాల్లో భాగంగా బాలల హక్కులు, వారి చట్టాలను వివరించారు. ఎంపిడిఒ తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బాలల రక్షణ విభాగం సిబ్బంది ఐ.జనార్దన, ఎ.గీత, చైల్డ్‌హెల్ప్ లైన్ కౌన్సిలర్ ఎం.సునీత, ఝాన్సీ, సిహెచ్‌ఒ అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న అధికారులు

అక్రమ నిర్మాణంపై చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరపాలక సంస్థ పరిధిలో హయతీనగరం వద్ద నాగావళి నదిఒడ్డున కడుతున్న అక్రమ నిర్మాణాన్ని పట్టణ ప్రణాళిక అధికారులు అడ్డుకున్నారు. పునాదులు వేస్తున్న క్రమంలో నిర్మాణాన్ని పూర్తిగా జెసిబితో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ అనుమతి లేని అక్రమ నిర్మాణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షంచమన్నారు. ప్రతి నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అన్నారు. అదనపు నిర్మాణాలకు సైతం అనుమతులు తీసుకోవాలన్నారు.

ఆకట్టుకున్న ఏకపాత్రాభినయం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలో కొత్తశాసనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని వి.రాణి ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు ఏకపాత్రభినయం అందరినీ ఆకట్టుకుంది. హెచ్ఎం పైడి గోపాలరావు ఆధ్వర్యాన సీతారామరాజు ఏకపాత్రభినయం నిర్వహించారు. వీర గాథ 5.0 కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రదర్శన చేసిన రాణి ఆకట్టుకునేలా ప్రదర్శన చేసినందుకు హెచ్ఎం, అధ్యాపకులు అభినందించారు.


ఏకపాత్రాభినయం చేస్తున్న రాణి

ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి- రణస్థలం

టెట్ నుంచి ఇన్‌సర్వీస్ టీచర్స్‌కు మినహాయింపు ఇవ్వాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసుల నాయుడు విజ్ఞప్తి చేశారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును రణస్థలంలో ఆయన స్వగృహంలో మంగళవారం కలిసి టెట్ పరీక్ష నుంచి 2011 కంటే ముందు ఉపాధ్యాయ వృత్తిలో చేరిన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పార్లమెంట్‌లో సవరణకు కృషి చేయాలని వినతిపత్రం అందించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ తాను అందుబాటులో ఉన్న ఎంపీలందరికి టెట్ సమస్యపై వినతిపత్రాలు ఇస్తున్నామని, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రణస్థలం మండల విద్యాశాఖాధికారి ఎ.త్రినాథరావు, పిఆర్‌టియు స్టేట్ కౌన్సిలర్ కెల్ల రమణ, స్టేట్ మహిళా సెక్రటరీ కె.ఇందిర, పిఆర్‌టియు రణస్థలం అధ్యక్షులు పి.గురునాయుడు, జనరల్ సెక్రెటరీ బి.చిన్నం నాయుడు, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌జెఎస్ రాజు, హైమవతి, విజయ్ కుమార్, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ

మహిళలు పారిశ్రామికవేత్తలు కావాలి


నూతన కార్యవర్గంతో ప్రమాణం చేయిస్తున్న మెప్మా అధికారులు

ఆమదాలవలస: స్వయం సహాయక సంఘ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా తయారు కావాలని జిల్లా టిడిపి సాధికార కమిటీ సభ్యుడు, నియోజకవర్గం యాదవ సంఘం అధ్యక్షుడు నాగళ్ల మురళీధర్ యాదవ్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 10వ వార్డు పరిధి మెట్టక్కివలసలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక మహాజనసభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తుందన్నారు. భవిష్యత్‌లో మహిళలు మరింత చురుకైన పాత్రను పోషించి రాణించాలన్నారు. ఈ సమావేశంలో మొత్తం 25 సంఘాల సభ్యులు అలాగే ఇసి, ఒబి కమిటీ సభ్యులు పాల్గొని గడచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పలు అంశాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కొత్త పదాధికారులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆర్.స్వాతి, కోశాధికారిగా వి.భవాని, కార్యదర్శిగా కె.స్వరాజ్యలక్ష్మి, ఎస్.సైరా, ఉప కార్యదర్శిగా కె.లక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కారుణ్య ధర్మారావు, గొల్లపల్లి సింహాద్రి, సిఒ వినోద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మెరుగైన సేవలే లక్ష్యంగా ముందుకు సాగాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ వై.డి. రామారావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖను మంగళవారం సందర్శించారు. జిల్లా రెడ్‌క్రాస్ చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, కార్యక్రమాలు చేపడుతున్న ప్రాంతాలకు వెళ్లి ప్రత్యక్షంగా పర్యవేక్షించి సంబంధిత ఇన్‌ఛార్జిలతో మాట్లాడారు. సంతృప్తి నిచ్చేలా రెడ్‌క్రాస్ సేవలు ఉండాలన్నారు. రక్తదానం, నేత్రదానం, అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. శాంతా కళ్యాణ్ అనురాగం నిలయం నందు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ ఎం.సి మెంబర్లతో, సిబ్బందితో మాట్లాడి రెడ్‌క్రాస్ ప్రాథమిక సూత్రాలను దృష్టిలో ఉంచుకొని సేవా కార్యక్రమాలు అందించడంలో ముందు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.మల్లేశ్వరరావు, పి చైతన్య కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న రామారావు

26 నుంచి జోగారావు జయంతి వేడుకలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అరసవల్లి: శ్రీసుమిత్రా కళాసమితి, ఆరామ ద్రావిడ సంఘం సంయుక్తంగా ఇప్పిలి జోగారావు 102 జయంతి వేడుకలు నాలుగురోజుల పాటు పట్టణంలోని బాపూజీ కళా మందిర్‌లో నిర్వహిస్తున్నట్టు శ్రీసుమిత్రా కళాసమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తనతండ్రి జ్ఞాపకార్థం ఈనెల 26 నుంచి నాలుగు రోజుల పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశం నలుమూలల నుంచి ప్రఖ్యాత మృదంగం, వయోలిన్, కంజెర, నాదస్వరం, డోలు, వీణ, వేణువు, ఘటం విద్వాంసులతో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ నిర్వహించే సాంస్కృతిక సంగీత కార్యక్రమాలకు ప్రజలు, కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సుమిత్రా కళా సమితి ప్రతినిధులు గుత్తు చిన్నారావు, కొంక్యాన మురళీధర్, నక్క శంకరరావు, మండవిల్లి రవి, ఆరామ ద్రావిడ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు సుసరాపు గోవిందరాజులు, దార్లపూడి ప్రసాదరావు, భాస్కరభట్ల నరసయ్యశర్మ, పూజ, వరలక్ష్మీ తదితరులున్నారు.

కిరణ్‌కుమార్ ఆదర్శప్రాయుడు

ప్రజాశక్తి- సోంపేట

చదువుతోపాటు కరాటే క్రీడలో విశేషంగా రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధిస్తున్న మత్స్యకార కుటుంబానికి చెందిన పొట్టి కిరణ్ కుమార్ ప్రస్తుత తరానికి ఆదర్శప్రాయుడని వక్తలు అభినందించారు. మండలంలోని ఇసకలపాలెంలో మంగళవారం జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సూరాడ చంద్రమోహన్, స్థానిక పెద్దలు బి.ఈశ్వరరావు, వి.రామారావు తదితరుల ఆధ్వర్యాన పొట్టి నాగేశ్వరరావు, దేవకి దంపతుల కుమారుడు కిరణ్ కుమార్‌కు దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసకలపాలెంకు చెందిన నాగేశ్వరరావు అండమాన్‌కు వలస వెళ్లి ఇదే వృత్తిలో ఉంటూ 14 గ్రామాలకు అధ్యక్షుడిగా నాయకత్వం వస్తున్నారని అన్నారు. స్వగ్రామానికి ఎంతో సేవలందించారన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు ఎస్.జీవన్‌రావు, బి.రాజారావు, పి.రామారావు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న గ్రామస్తులు

డొంకూరు విద్యార్థులకు బంగారు పతకాలు


అభినందిస్తున్న ఉపాధ్యాయులు


ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మండలంలోని డొంకూరు బాలికలు బంగారు పథకాలు సాధించారని ప్రధానోపాధ్యాయులు జి.హేమకుమారి తెలిపారు. ఈ మేరకు అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ఇటీవల కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన కడప జిల్లా బద్వేల్‌లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీలు ఈ నెల 7 నుంచి 9 వరకు నిర్వహించారు. ఇందులో జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. వీరిలో పాఠశాల విద్యార్థులు జె.అను, ఎస్.హేమలత జిల్లా జట్టు తరపున ప్రతిభ కనబరిచి బంగారు పతకం పొందారు. వీరికి పాఠశాల సిహెచ్.వెంకటరమణ, వై.కమలాకర్, ఎల్.గోవిందరావు, శ్రీహరి, శంకర్‌రెడ్డి, ఎస్.సువర్ణ, పి,పద్మావతి అభినందించారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- పొందూరు

విద్యార్థినులు వృత్తివిద్యా కోర్సుల ద్వారా వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించు కోవాలని ప్రిన్సిపాల్ టి.ఇందిర అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిహెచ్‌డబ్ల్యు (ఎఫ్) చదువుతున్న విద్యార్థినులకు స్థానిక పివిఎస్ రామ్మోహన్ ఆస్పత్రిలో ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే వైద్యవృత్తిలో రాణించగలరని సూచించారు. రెండు నెలల పాటు ఇస్తున్న ఈ శిక్షణా కార్యక్రమాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డి.శిరీషా, బి.సౌజన్య పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఇందిర

సర్వేను సక్రమంగా నిర్వహించాలి

పలాస: ప్రభుత్వం అమలు చేస్తున్న సుమిత్వ సర్వేను సక్రమంగా నిర్వహించాలని పలాస డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి బి.శైలజ అధికారులకు సూచించారు. మండలంలోని రఘునాథపురం గిరిజన గ్రామంలో మంగళవారం సుమిత్వపై గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లోని గ్రామ కంఠ భూములను గుర్తించాలన్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆధీనంలో ఉందా? పంచాయతీ ఆధీనంలో ఉందా? అనే విషయాన్ని పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. గ్రామంలో నివసిస్తున్న ప్రజల ఇళ్లను సర్వే చేసి నివాస గృహాల హద్దులను గుర్తించాలన్నారు. సర్వే చేయకముందు సంబంధిత ఇళ్ల యజమానులకు విషయాన్ని అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలన్నారు. ఇంటింటా చెత్త సేకరణ తప్పని సరిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వసంత కుమార్, డిప్యూటీ ఎంపిడిఒ వైకుంఠరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం

పలాస: కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన తొమ్మిది మంది కుటుంబాలకు మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తన వంతు సహాయంగా రూ.2 చొప్పున ప్రకటించారు. మందస మండలం బోర బృందావతి, దువ్వు రాజేశ్వరి మృతుల కుటుంబాలకు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం చెక్కులను అందజేశారు. ముందుగా జరిగిన ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైసిపి అబ్జర్వర్, మాజీ కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు, మాజీ తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మాజీ కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు.

కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా సంతోష్‌కుమార్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఉనా సంతోష్‌కుమార్‌ను రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నియమించారు. తనను నియమించడంపై ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, కె.అచ్చెన్నాయుడులకు ధన్యవాదాలు తెలియజేశారు. తనపై పెట్టిన నమ్మకాన్ని సక్రమంగా నిర్వహిస్తానని, కళింగ వైష్యుల అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

దుర్గాపుపుట్టుగలో సేవా శిబిరం

కవిటి: ఎస్‌విజె డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 విద్యార్థులు దుర్గాపుపుట్టుగలో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో భాగంగా మంగళవారం ఉదయం గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం, సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కో-ఆర్డినేటర్ వనజ మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం కలిగి సమాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భాస్కరరావు, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారులు జె.భీమరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కంచిలి

మండల కేంద్రంలోని బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎచ్చెర్ల ధనుష్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని, తోటి ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ధనుష్ 2024లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బంగారు పతకం, 2025లో వెండి పతకం సాధించినట్లు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని గరుడవాడలో నవంబరు 12 నుంచి 17 వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున అండర్-19 విభాగంలో ధనుష్ పాల్గొంటాడని తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

అపరాల సాగుపై దృష్టి

కంచిలి: రానున్న రబీ సీజన్‌లో రైతులు అపరాల సాగుపై దృష్టి సారించాలని ఎఒ కె.సురేష్ కోరారు. మండలంలోని కర్తలిలో మంగళవారం రైతులతో రబీ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపరాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాల ఎంపిక, విత్తన శుద్ధి ప్రక్రియ, నువ్వుల సాగులో యజమాన్య పద్ధతులు గురించి తెలియజేశారు. ఆపరాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తుందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతుల తో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నాయకుల పరామర్శ

ఇచ్ఛాపురం : కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఇటీవల జరిగిన తొక్కిసలాటలో పలాసకు చెందిన దొక్కరి అమ్ములమ్మ, వజ్రపుకొత్తూరు మండలం దుక్కవానిపేటకు మురిపింటి నీలమ్మ కుటుంబ సభ్యులను వైసిపి నాయకులు మంగళవారం పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో వైసిపి బిసి విభాగం కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభజాతీయ నేతలు కొర్రాయి వాసు యాదవ్, సాలిన, లక్ష్మణమూర్తి యాదవ్, అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు అధ్యక్షులు రాపాక చిన్నారావు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.షణ్ముఖరావు, మహిళా సంఘం అధ్యక్షులు బద్రి సీతమ్మ యాదవ్ పాల్గొన్నారు.

35 మంది రక్తదానం

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సాయి శిరీష డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన టెక్కలి బ్లడ్ బ్యాంక్ నోడల్ అధికారి డాక్టర్ సునీత సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి డాక్టర్ సునీత మాట్లాడుతూ మీరు చేసిన రక్తదానం వల్ల ఎంతో మంది ప్రాణాలు కాపాడిన వారు అవుతారని అన్నారు. రక్తదానంపై ఆపోహాలు పెట్టుకోవద్దని, రక్తదానం చేయడం వల్ల మరింత ఆరోగ్యకంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బమ్మిడి చంద్రశేఖరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.మేఘరావు, వైస్ ప్రిన్సిపాల్ జె.శ్రీను, ఎఒ పి.శ్రీను పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

సోంపేట: అటవీశాఖ అధికారుల ఆధ్వర్యాన మండలంలోని మాలగోవిందపురం గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు మంగళవారం వన్యప్రాణుల పరిరక్షణపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. అలాగే అడవులను సంరక్షించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. పాఠశాల సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.